# వైద్యవిద్యలో ప్రమాణాలు తగ్గితే ప్రజల ప్రాణాలకు ముప్పు

## ఘోస్ట్ ఫ్యాకల్టీతో నడిపిస్తే చర్యలు: కాలేజీ యాజమాన్యాలతో మంత్రి దామోదర రాజనర్సింహ



సోమవారం సచివాలయంలో వైద్యకళాశాలల యాజమాన్యాలతో సమావేశమైన మంత్రి రాజనరసింహ్మ

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** వైద్య విద్యలో నాణ్యత ప్రమాణాలు తగ్గితే ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని ఈ విషయంలో ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. నాణ్యత ప్రమాణాలు పాటించని ప్రైవేటు మెడికల్ కాలేజీల విషయంలో కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో ప్రైవేట్ మెడికల్ కాలేజీల మేనేజ్‌మెంట్స్, డీన్స్, ప్రిన్సిపల్స్‌తో మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో వైద్య విద్య నాణ్యత ప్రమాణాలు, ఎన్‌ఎంసీ నిబంధనలు, ఫాకల్టీ, అటెండెన్స్, ఫీజులు తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు. సమావేశంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితోపాటు వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ విసి నందకుమార్ రెడ్డి, డిఎంఈ నరేంద్ర కుమార్‌తోపాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ డాక్టర్లకు ప్రపంచ వ్యాప్తంగా మంచి పేరు ఉందని.. ప్రపంచంలోని ఎన్నో ప్రఖ్యాత మెడికల్ ఇనిస్టిట్యూట్స్‌ను ఇక్కడ చదువుకున్న డాక్టర్లు లీడ్ చేస్తున్నారని తెలిపారు. ఇక్కడి వైద్య విద్య ప్రమాణాల వల్లే అది సాధ్యమైందని మంత్రి తెలిపారు. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఘోస్ట్ ఫాకల్టీని పెట్టి నడిపిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయని, ఈ పద్ధతి మంచిది కాదని మంత్రి హెచ్చరించారు. వైద్య విద్యలో నాణ్యత ప్రమాణాలు తగ్గితే ప్రజల ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందని.. ఈ విషయంలో ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. మెడికల్ స్టూడెంట్స్‌కు స్టయిఫండ్స్ చెల్లించే విషయంలో కొన్ని కాలేజీలపై వరసగా ఫిర్యాదులు వస్తున్నాయని, పిల్లలకు ఇచ్చే స్టయిఫండ్ విషయంలో రాజీ పడొద్దని, అది వాళ్ల చదువులపై ప్రభావం చూపే ప్రమాదం ఉందన్నారు. కాలేజీలకు అనుబంధంగా ఉన్న టీచింగ్ హాస్పిటల్స్‌లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అదనపు ఫీజుల కోసం స్టూడెంట్స్‌ను ఇబ్బంది పెట్టినా, అడ్వాన్స్‌గా ఫీజులు కట్టాలని ఒత్తిడి చేసినా ఉపేక్షించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎన్‌ఎంసీ నిబంధనల విషయంలో కాలేజీలు లేవనెత్తిన సమస్యలను, ఎన్‌ఎంసీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామని మంత్రి తెలిపారు.

**వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్త పడాలి: మంత్రి దామోదర:** వేసవి కాలం కావడంతో ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో వడ దెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుపుతూ ఆరోగ్యశాఖ రూపొందించిన పోస్టర్‌ను మెడికల్ కార్పొరేషన్ (టీజీఎంఎస్ఐడీసీ) కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విడుదల చేశారు. ఎండలు ముదురుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు మంత్రి సూచించారు. బయటకు వెళ్లినప్పుడు ఎండదెబ్బ బారిన పడకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగు నీరు తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలని, ఎక్కువసేపు ఎండలో ఉండకూడదని సూచించారు. ఒకవేళ ఏదైనా ఇబ్బంది కలిగితే తక్షణమే సమీపంలోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లాలన్నారు. తమ చుట్టూ ఉన్నవారిలో ఎవరికైనా వడ దెబ్బ తగిలితే, వెంటనే సమీపంలోని హాస్పిటల్‌కు బాధితున్ని తరలించాలని, 108 అంబులెన్స్‌కు సమాచారం చేరవేయాలని మంత్రి ప్రజలను కోరారు. మామిడి కాయలను ఎలా మాగబెట్టాలో తెలిపే అవేర్‌నెస్ పోస్టర్‌ను వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆవిష్కరించారు. ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ తయారు చేసిన ఈ పోస్టర్‌ను మంత్రిగారు ఆవిష్కరించారు. మామిడి పండ్ల వ్యాపారులు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సహజ పద్ధతుల్లోనే మామిడికాయలను మాగబెట్టాలని మంత్రి సూచించారు. కార్బైడ్ వంటి నిషేధిత పదార్థాలను వినియోగించొద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. నిషేధిత పదార్థాలను ఉపయోగించినట్టు తేలితే కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. రెగ్యులర్‌గా తనిఖీలు చేయాలని ఫుడ్ సేఫ్టీ అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు.

# నిషిద్ధ సిగరెట్లు విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు



**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** హైదరాబాద్ సహా రాష్ట్రంలోని పలుచోట్ల విద్యా సంస్థల వద్ద నిషిద్ధ ఈ సిగరెట్లను విద్యార్థులకు అమ్ముతూ మైనర్ విద్యార్థుల ను మత్తుకు బానిసలుగా చేస్తున్న ముఠా గుట్టును తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో (టి.నాబ్)తో పాటు సిటీ పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేసి రట్టు చేశారు. ఈ సందర్భంగా 25 లక్షల రూపాయల విలువచేసే ఈ సిగరెట్లతో పాటు ఇంకొన్ని వస్తువులను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను టి.నాబ్ డైరక్టర్ సందీప్ శాండిల్యా సోమవారం మీడియాకు వెల్లడించారు. అబిడ్స్ పరిధిలోని లిటిల్ ఫ్లవర్, సుజాత హైస్కూట్, గ్రామర్ స్కూల్, సెంట్ మేరీ జూనియర్ కాలేజి, రోజరీ కాన్వె ంట్ సహా పలు విద్యా సంస్థల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు నిషిద్ధ ఈ సిగరెట్లను అమ్ముతున్నారని విద్యా సంస్థల నిర్వాహకులు టి.నాబ్‌కు ఫిర్యాదు చేశారు. దీనివల్ల తమ పిల్లలు చెడిపోతున్నారని, కొందరు వ్యసనాలకు లోనవుతూ జీవితాలను పాటు చేసుకుంటున్నారని అందులో వుంది. దీనిపై రంగంలో దిగిన టి.నాబ్, సిటీ పోలీసులు అబిడ్స్ వద్ద గల విద్యా సంస్థలపై నిఘా వుంచారు. విద్యా సంస్థల వద్ద అనుమానితులపై నిఘా వుంచగా ఇద్దరు పట్టుబడ్డారు. వీరి వద్ద 25 లక్షల రూపాయల విలువచేసే మత్తు పదార్థాలతో కూడిన నిషిద్ధ ఈ సిగరెట్లు లభించాయి. పట్టుబడ్డ వారిని నాంపల్లికి చెందిన సాదిక్ లలాని, అనిల్ లలానిగా గుర్తించారు. వీరు ఢిల్లీకి చెందిన అమిత్ ముంబాయికి చెందిన వాసిం అనే వ్యక్తుల నుంచి ఈ సిగరెట్లను కొంటున్నట్లు తేలింది. పట్టుబడ్డ ఇద్దరు నిందితులు తెలివిగా వుంటూ వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని మైనర్ విద్యార్థులకు వంద రూపాయలు మొదలుకుని వెయ్యి రూపాయల వరకు ఈ సిగరెట్లను విక్రయిస్తున్నారని తేలింది. ఈ గ్రూపులు పలు రకాల పేర్లతో వున్నాయి. కాగా ఈ సిగరెట్ల అమ్మకాల తరువాత డబ్బులను ఆన్‌లైన్ ద్వారా గూగుల్ పే, ఫోన్ పే సహా పలు మార్గాల ద్వారా నిందితులు తీసుకుంటున్నారు. వీరి నుంచి ఇప్పటి వరకు 17 మంది మైనర్ విద్యార్థులు ఈ సిగరెట్లు కొని వాడుతూ వాటికి బానిసలుగా మారారని తేలింది. వీరితో పాటు మరో 400 మంది యువకులు ఈసిగరుట్లను ఇద్దరు నిందితుల నుంచి కొంటున్నట్లు తేలింది. వీరికి విచారించేందుకు టి.నాబ్ రెడీ అవుతోంది. ఈ సిగరెట్లు విక్రయిస్తూ దొరికిపోయిన ఇద్దరికి వీటిని అమ్ముతున్న మరో ఇద్దరికోసం గాలింపు చేబట్టారు. ఈ కేసు విచారణను అబిడ్స్ పోలీసులకు బదలాయించారు.

## కొనసాగుతున్న సహాయక చర్యలు..

### టన్నెల్ 2 వద్దకు చేరిన టిబిఎం బేరింగ్

### 24న ప్రభుత్వానికి నివేదిక

**నాగర్ కర్నూల్ ప్రతినిధి,ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద ఎస్ ఎల్బీ టన్నెల్ వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు జరిగిన సహాయక చర్యలపై పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు సమాచారం. ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి శివశంకర్ ఈనెల 24న పూర్తి నివేదికతో సహాయక చర్యలపై ప్రభుత్వానికి ఒక రిపోర్టు పంపనున్నట్లు సమాచారం. ప్రత్యేక అధికారి రూపొందించిన నివేదిక ఆధారంగా సహాయక చర్యలు కొనసాగించాలా లేదా అనే విషయంపై ప్రభుత్వం ఒక నిర్ణయానికి రానున్నట్లు తెలిసింది. సొరంగ ప్రమాద ప్రదేశంలోని డి2 ప్రాంతంలో పెద్ద పెద్ద బండ రాళ్లను తొలగిస్తూ, మట్టి తవ్వకాలు కొనసాగిస్తూ కన్వేయర్ బెల్ట్ ద్వారా మట్టిని టన్నెల్ బయటకు తరలించే ప్రక్రియ నిర్విరామంగా కొనసాగుతుంది.

# కట్టుకున్న భర్తను హత్య చేసిన భార్య

## కెపిహెచ్‌బి కాలనీలో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



మృతుడు సాయిలు (ఫైల్)

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** భర్తపై విరక్తిని పెంచుకున్న హత్య చేసి గోనె సంచిలో మూట కట్టి నిర్మానుష్య ప్రాంతంలో పూడ్చిపెట్టింది భార్య. చెల్లెలి మరిది సహాయంతో భర్తకు కరెంటు షాక్ ఇచ్చి దారుణంగా హత్య చేసి పాతిపెట్టి ఎవరికి అనుమానం రాకుండా సొంతూరుకి వెళ్లిపోయింది. ఆటో డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు దర్యాప్తు చేయగా హత్య విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ దారుణ సంఘటన కేపీహెచ్బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కెపిహెచ్‌బికాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే ఓ ఆటో డ్రైవర్ సోమవారం కేపీహెచ్బీ కాలనీ పోలీస్ స్టేషనుకు వచ్చి రెండు రోజుల క్రితం ఇద్దరు మహిళలు ఓ వ్యక్తి మూటతో తన ఆటోలో ఎక్కారని చెప్పారు. మిత్ర హిల్స్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో మూటతో సహా దిగారని మూటలో ఏముందని ప్రశ్నించిన వారు పొంతనలేని సమాధానం చెప్పారని పోలీసులకు ఆటోడ్రైవర్ సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల దర్యాప్తులో పలు సంచలన విషయాలు వెలుగు చూశాయి. మెదక్ జిల్లా పాపన్నపేటకు చెందిన మృతుడు సాయిలు (49) అతని భార్య కవిత 20 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కాగా సాయిలు, కవితలకు అనారోగ్యం కారణంగా ఇరువురికి ఎయిడ్స్ పాజిటివ్ రావడంతో గత 15 సంవత్సరాలుగా వేరువేరుగా ఉంటున్నారు. మెదక్ జిల్లా పాపన్నపేటలో సాయిలు నివసిస్తూ అక్కడే కూలిపని చేస్తుండగా కవిత హైదరాబాదులో ఉంటుంది. అయితే గత వారం రోజుల క్రితం కవిత సొంతూరులో పనిచేస్తున్న భర్త దగ్గరికి వెళ్లి అతను పని చేస్తున్న మేస్త్రీ దగ్గర సాయిలు తీసుకున్న 24వేల రూపాయల అప్పు చెల్లించి మిత్ర హిల్స్‌లో ఉంటున్న హతురాలు కవిత చెల్లెలు జ్యోతి, మరిది శ్రీనివాసుల ఇంటికి తీసుకువచ్చింది. స్థానికంగా మిత్రాయిల్స్‌లో ఉంటున్న సాయిలు ఇసుక పనికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం భార్యాభర్తల మధ్య తీవ్ర స్థాయిలో గొడవ జరగడంతో కవిత చెల్లెలు, మరిది సాయంతో భర్త సాయిలుకు కరెంట్ షాక్ ఇచ్చింది. దీంతో అతను సంఘటన స్థలంలోనే చనిపోగా ముగ్గురు కలిసి మృతదేహాన్ని కొనసంచిలో మూటకట్టి ఆటోలో వెళ్లి మిత్ర హిల్స్‌లోని నిర్మానుష్య ప్రాంతంలో గుంత తవ్వి పూడ్చిపెట్టి ఇంటికి తిరిగివచ్చారు. అనంతరం కవిత మెదక్ జిల్లా పాపన్నపేటకు వెళ్లి తన భర్త సాయిలు పని కోసం బయటకు వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులను నమ్మించింది. ఎవరికి అనుమానం రాకుండా కవిత ఎంత ప్రయత్నం చేసినప్పటికీ ఆటో డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో కెపిహెచ్బి కాలనీ పోలీసులు చేపట్టిన దర్యాప్తుతో సాయిలు హత్య ఉదంతం బయటపడింది. సమాచారం అందుకున్న కూకట్పల్లి ఏసిపి కే. శ్రీనివాసరావు కెపిహెచ్బి కాలనీ సీఐ రాజశేఖర్ రెడ్డిలో మిత్ర హిల్స్‌లోని కవితకు సంబంధించిన చెల్లెలు జ్యోతి, మరిది శ్రీనివాసరావులను విచారించి వారి ఇంటిని పరిశీలించారు. బాలనగర్ తాసిల్దార్ సమక్షంలో పాతిపెట్టిన సాయిలు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసును కేపీహెచ్బీ కాలనీ పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నాంపల్లి కోర్టుకు హాజరైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్. ఏప్రిల్21:** నాంపల్లి కోర్టుకు సోమవారం కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐ తీవ్రవాదులు బెదిరింపుకు పాల్పడ్డారని, వారిపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో కేసు విచారణ నిమిత్తం విట్నెస్‌గా నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు.

# రాష్ట్ర వ్యాప్తంగా ఎసిబి దాడులు: ఏడుగురు అరెస్ట్







**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏప్రిల్18:** రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ దాడులు సంచలనంగా మారాయి. సోమవారం ఒక్కరోజు నాలుగు కేసులు నమోదు చేశారు. నమోదైన నాలుగు కేసులలో ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఏడుగురిలో పోలీస్ శాఖకు చెందిన సిఐ,మున్సిపల్ శాఖకు చెందిన డిప్యూటీ ఈఈ ఉన్నారని చెప్పారు. మార్చి నెలలో 15 కేసులు నమోదు చేసి 15 మంది ప్రభుత్వ అధికారులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ నెలలో ఇప్పటి వరకు 13 కేసులు నమోదు అవ్వగా 19 మందిని అరెస్ట్ చేసినట్లు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. అయితే సోమవారం ఒక్క రోజు 4 కేసులు నమోదు కావడం ఏడుగురు అరెస్ట్ కావడం సంచలనంగా మారింది. మణుగూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిఐ సోమ సతీష్‌కుమార్, రంగారెడ్డి జిల్లా పరిధిలోని నాగారం మున్సిపాలిటీలో డిప్యూటీ ఈఈగా చేస్తున్న సుదర్శనం రఘు, ఆయనతో పాటు ఔట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు వి.రాకేశ్,వి. సురేష్ పట్టుబడ్డారు. నాంపల్లి ఏసీబీ కోర్టులో వారిని హాజరుపరిచారు. నిజామాబాద్ జిల్లా అర్మూర్‌కు పంచాయతీరాజ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ ఎన్.శ్రీనివాస్ శర్మ ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్‌పై సంతకం చేసేందుకు రూ.7వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుబడ్డారు. జనగాం జిల్లా చిల్పూర్ తహసిల్దారు కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వినిత్‌కుమార్ మ్యూటేషన్‌కు సంబంధించి ఫీల్ట్ విజిట్ చేసేందుకు 26వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్లు సమాచారం.

## నిజామాబాద్ రైతు మహోత్సవంలో స్వల్ప ప్రమాదం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్. ఏప్రిల్21:** నిజామాబాద్ రైతు మహోత్సవంలో సోమవారం స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. అధికారుల సమన్వయ లోపంతో ఒకచోట దిగాల్సిన తెలంగాణ మంత్రుల హెలికాప్టర్ మరో చోట దిగింది. వాస్తవానికి నిజామాబాద్ కలెక్టరేట్‌లో హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం అధికారులు లాంచ్ ప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. కానీ పైలెట్ మాత్రం ఆ లాంచ్ ప్యాడ్‌పై కాకుండా సభ ప్రాంగణంలో హెలికాప్టర్‌ను ల్యాండ్ చేశారు. గాలి దుమారంతో స్వాగత తోరణం కూలింది. ఆ హెలికాప్టర్‌లో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, షబ్బీర్ అలీ ఉన్నారు. హెలికాప్టర్ గాలికి సభా ప్రాంగణం నుంచి రైతులు పరుగులు పెట్టారు. సభలో స్వల్ప తొక్కిసలాట జరిగింది.

## బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు మజ్లిస్ చేతిలో కీలుబొమ్మలు: కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్. ఏప్రిల్18:** అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, శాసనసభలో ప్రధాన ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ.. ఆ రెండు పార్టీలు శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేయకుండా మజ్లిస్ పార్టీకి అండగా నిలబడి, మజ్లిస్ పార్టీకి మేలు చేకూర్చే ప్రయత్నం చేస్తున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారంపార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

# నేటి నుంచి బిసి గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు

## 257 కాలేజీల్లో 22,080 సీట్లు, మే 12 తుది గడువు

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బిసి గురుకుల జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో అడ్మిషన్లకు నేటి(మంగళవారం-ఏప్రిల్ 22) నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. మే 12వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు బిసి గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులుతెలిపారు. 257 కాలేజీల్లో 22,080 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ను ఆయన సోమవారం జారీ చేశారు. రాష్ట్రంలోని బిసి గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో జూనియర్ ఇంటర్మీడి యట్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి సైదులు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 130 బాలుర జూనియర్ కాలేజీల్లో 11,360 సీట్లు, 127 బాలికల జూనియర్ కాలేజీల్లో 10,720సీట్లు ఉన్నాయని తెలిపారు.

# సెక్రటేరియట్ వద్ద 280 సిసి కెమెరాలతో నిఘా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏప్రిల్21:** తెలంగాణ సెక్రటేరియట్‌లో నకిలీ ఉద్యోగుల కలకలంపై సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. సెక్రటేరియట్ భద్రత ఏర్పాట్లు, సిఎం ఎంట్రీ,ఎగ్జిట్ సీసీ కెమెరాల నిఘాపై జిఏడీ ఆరా తీసింది. అయితే సిఎం రేవంత్‌రెడ్డి ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాల్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఎస్‌పిఎఫ్‌పై జిఏడీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటికే సెక్రటేరియట్ మొత్తం 246 సీసీ కెమెరాలు మరో 30 కెమెరాలు పెట్టే యోచనలో ఉన్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి. సిఎం ఎంట్రీ ఎగ్జిట్ మార్గాలతో పాటు కీలకమైన 6వ అంతస్తులో భద్రత పెంచాలని నిర్ణయం తీసుకున్నాయి. సాధారణ ప్రజలు ఎంట్రీ అయ్యే సౌత్ ఈస్ట్ గేటుతో పాటు ఇన్‌సైడ్ ఎంట్రీ వద్ద మరోసారి చెకింగ్ చేయనుంది. సెక్రటేరియట్‌లో రెండంచెల భద్రత వలయాన్ని ఎస్‌పిఎఫ్ మోహరించింది.

# పోప్ మృతికి ప్రముఖుల సంతాపం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** క్యాథలిక్ మతపెద్ద పోప్ ఫ్రాన్సిస్ మరణంపై భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోప్ మరణ వార్త తీవ్ర బాధను కలిగించిందన్నారు. భారత ప్రజల పట్ల ఆయనకున్న ప్రేమ ఎల్లప్పుడూ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఈ పోస్టుకు గతంలో వాటికన్ సిటీలో పోప్ ఫ్రాన్సిస్‌ను కలిసిన సందర్భంగా దిగిన ఫొటోలను పంచుకున్నారు. అక్టోబర్ 2021లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటలీ పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. జీ20 సదస్సులో పాల్గొనేందుకు ఇటలీ వెళ్లిన ప్రధాని. వాటికన్ సిటీలో పోప్ ఫ్రాన్సిస్‌ను కలిశారు. దాదాపు 30 నిమిషాలపాటు పోప్ ఫ్రాన్సిస్, ప్రధాని మోదీ వివిధ విషయాలపై మాట్లాడుకున్నారు. అనంతరం భారత్‌కు రావాల్సిందిగా పోప్‌ను ప్రధాని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయనకు పలు ప్రత్యేకమైన బహుమతిని కూడా అందజేశారు. పూర్తిగా సిల్వర్‌తో తయారు చేసిన క్యాండిల్ స్టాండ్, ఓ పుస్తకాన్ని పోప్‌కు ప్రధాని బహుమతిగా ఇచ్చారు. ఫ్రాన్సిస్ కూడా మోదీకి ఓ గిఫ్ట్ ఇచ్చారు. ఇత్తడితో తయారు చేసిన ఓ సర్క్యులర్ మెమోంటోను అందజేశారు. బైబిల్ సూక్తులతో ఉన్న ఆగిఫ్ట్‌ను మోదీ అందుకున్నారు.

'పోప్ మరణవార్త ఇప్పుడే తెలిసింది. నేను ఆయనను నిన్ననే కలిశాను. కొవిడ్ తొలినాళ్లలో ఆయన ప్రసంగాలను నేను మర్చిపోలేను. అవి చాలా అద్భుతమైనవి.' **-జెడి వాన్స్, అమెరికా ఉపాధ్యక్షుడు.**

'నేడు పోప్ ఫ్రాన్సిస్ మరణానికి ప్రపంచం సంతాపం తెలియజేస్తోంది. విధి వంచితుల విషయంలో ఆయన ప్రేమ, మానవత్వం కేథలిక్ ప్రపంచానికి వెలుపల కూడా కొన్ని లక్షల మందిని ప్రభావితం చేసింది.' **- ఉర్సులా వాన్‌డెర్ లెయిన్, ఐరోపా సమాఖ్య అధ్యక్షురాలు.**

'పోప్ ఫ్రాన్సిస్ మరణం ప్రపంచానికి తీరని లోటు. ఆయన కరుణ, ప్రేమకు ప్రతిరూపం. సత్యం కోసం ఎప్పుడూ నిలబడ్డారు. మరింత శాంతియుత, దయామయ ప్రపంచాన్ని కోరుకొనే లక్షలమందికి ఆయనో స్ఫూర్తిదాత'. **- ప్రియాంకా గాంధీ వాద్రా, లోక్‌సభ ఎంపి, కాంగ్రెస్ నేత.**

'పోప్ ఫ్రాన్సిస్ మృతి మానవాళికి తీరని లోటు. ఆయన మహోన్నత ఆధ్యాత్మిక వ్యక్తి. ప్రపంచ శాంతి స్థాపకుడిగా పోప్ ఫ్రాన్సిస్ పాత్ర అద్భుతం.' **- తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి.**

'పోప్ ఫ్రాన్సిస్ మృతి నన్ను ఎంతో బాధించింది. ఆధ్యాత్మిక నాయకుడిగా కోట్ల మందిలో స్ఫూర్తి నింపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున ప్రపంచ క్యాథలిక్ కమ్యూనిటీకి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా.' **- ఏపి సిఎం చంద్రబాబు.**

క్యాథలిక్ చర్చి అధినేత పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి **జూపల్లికృష్ణారావు** సంతాపం తెలిపారు.

ప్రేమ అభిమానాలతో, సుఖశాంతులతో, విశ్వ మానవాళి జీవించాలని, జీసస్ క్రీస్తు బాటలో నడిచిన పోప్ ఫ్రాన్సిస్ మరణం ప్రపంచ శాంతికి తీరనిలోటు **- మాజీ సిఎం కెసిఆర్**

## చిన్నారికి ఉచిత బస్ పాస్

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** ఆర్‌టిసి బస్సులో జన్మించినచిన్నారికి జీవితకాలం ఉచిత బస్‌పాస్ ఇవ్వాలని టిజిఎస్‌ఆర్‌టిసి నిర్ణయించింది.దాంతో కాన్పు చేసిన ఆశా వర్కర్‌కి డీలక్స్‌తోపాటు సూపర్‌లగ్జరీబస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్టు సంస్థప్రకటించింది.

## సైబర్ నేరస్తుడు పరార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్ .ఏప్రిల్18:** తెలంగాణ భవన్ నుంచి సైబర్ నేరస్తుడు పరారయ్యాడు. ఢిల్లీలో అరెస్ట్ చేసి ఆదివారం రాత్రి తెలంగాణ భవన్‌కు తీసుకొచ్చారు. తమతోపాటు సైబర్ నేరస్తుడిని రూంలోనే ఉంచుకొని పోలీసులు నిద్రపోయారు. అయితే సోమవారం ఉదయం లేచి చూసేసరికి నిందితుడు తప్పించుకుని పారిపోయాడు. దీంతో సైబర్ నేరస్తుడిపై ఢిల్లీ పోలీసులకు తెలంగాణ పోలీసులు ఫిర్యాదు చేశారు.

# అరిజోనా స్టేట్ యూనివర్సిటీతో అనురాగ్ వర్సిటీ ఎంఒయు





**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** భారతీయ విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్య సులభతరంగా అందించడానికి అరిజోనా స్టేట్ యూనివర్సిటీతో తెలంగాణకు చెందిన అనురాగ్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం(ఎంవోయు) కుదుర్చుకుంది. ఇందుకు సంబంధించి రెండు యూనివర్సిటీల మధ్య సోమవారం కీలక ఎంవోయు కుదిరింది. రెండు వర్సిటీల ఒప్పందం ద్వారా విద్యార్థులు కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్, వ్యాపారం, మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో బ్యాచిలర్ డిగ్రీలతోపాటు మాస్టర్ డిగ్రీలను సాధించే అవకాశం పొందనున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఎంవోయూ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ ఛైర్మన్ డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ అర్చనా మంత్రి, సీఈవో నీలిమ, అరిజోనా స్టేట్ యూనివర్సిటీ గ్లోబల్ పార్టనర్‌షిప్ డెవలప్‌మెంట్ సీనియర్ డైరక్టర్ క్రిస్ జాన్సన్ పాల్గొన్నారు. ఎంవోయూ ఫలితంగా భారత్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయం ఇంటర్నేషనల్ కాలేజీలో విద్యార్థులు తమ చదువును ప్రారంభించి, తర్వాత అమెరికాలోని అరిజోనా స్టేట్ యూనివర్సిటీలో తమ డిగ్రీని పూర్తి చేసే అవకాశం ఏర్పడుతుంది. ఈ సహకారం అనురాగ్ విశ్వవిద్యాలయం, ఏఎస్‌యూని భారతీయ విద్యార్థులకు తక్కువ ఖర్చుతో, అత్యుత్తమ విద్యను అందించే విశ్వవిద్యాలయాలుగా నిలిపి, విద్యార్థుల గ్లోబల్ విజయానికి బాటలు వేస్తుందన్నారు. ఈ భాగస్వామ్యం అంతర్జాతీయ విద్యకు అవకాశాలను పెంచుతుంది. ఎంవోయు సందర్భంగా అనురాగ్ విశ్వవిద్యాలయం, ఏఎస్‌యూ సంయుక్తంగా హైదరాబాద్‌లో ఒక ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించాయి. సమావేశంలో అమెరికా కాన్సులేట్, ఎడ్యుకేషన్ యూఎస్ఏ, హైదరాబాద్‌లోని ప్రముఖ అంతర్జాతీయ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, కౌన్సెలర్లు పాల్గొన్నారు.

# తెలంగాణలో రోహిత్ వేముల చట్టం తీసుకురండి

## సిఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ లేఖ

**హైదరాబాద్,ఏప్రిల్21,ప్రభాతవార్త:** తెలంగాణలో రోహిత్‌వేముల చట్టాన్ని తీసుకొని రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ లేఖ రాశారు. రోహిత్‌వేముల, పాయల్‌తాడ్వీ,దర్శన్‌సోలంకి వంటి మంచి భవిష్యత్ ఉన్న యువకులు అర్ధాంతరంగా తమ జీవితాలను ముగించారని ఆలేఖలో పేర్కొన్నారు. ఇలాంటి ఆత్మహత్యలు నివారించాలని ఆయన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణలోయువత హత్యలను ఆపేందుకు కొత్త చట్టం తీసుకొని రావాలని సిఎం రేవంత్‌రెడ్డిని లేఖలో కోరారు. అంబెడ్కర్ నుంచి మొదలు కొని రోహిత్ వేములతో పాటు లక్షలాది మంది ఎదుర్కొన్న వివక్షను ఇతరులు ఎదుర్కొకుండా ఉండేందుకు ఈ చట్టాన్ని రూపొందించాని సూచించారు. కర్నాటక, హిమాచల్ ప్రదేశ్‌లోకూడా రోహిత్ వేముల చట్టం తీసుకొనిరావాలని ఎక్స్‌వేదికపై రాహుల్ ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు సిద్ధ రామయ్య, సుఖవిందర్‌సింగ్‌లను కోరారు.రాహుల్ పేదల గురించి ఆలోచిస్తాడని ఎంపి చామల కిరణ్ అన్నారు.

## స్కూల్ అసిస్టెంట్లకు హెడ్మాష్టర్లుగా పదోన్నతులు కల్పించాలి

### విద్యాశాఖ కార్యదర్శికి ఎమ్మెల్సీ మల్క కొమరయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలని కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్సీ సోమవారం విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణాకు విజ్ఞప్తి చేశారు. అంతకంటే ముందు పాఠశాల విద్యా డైరక్టర్ నరసింహా రెడ్డికి కూడా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) తరపున ప్రాతినిధ్యం చేసినట్టు సంఘం నాయకులు తెలిపారు. గతంలోనే గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ పదోన్నతులు కల్పించడానికి అర్హులైన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులచే సీనియార్టీ లిస్టులు రూపొందించి వెబ్ ఆప్షన్స్ నమోదు చేసే సమయంలో సాంకేతిక కారణాల వలన పదోన్నతులు వాయిదా పడ్డాయని ఎమ్మెల్సీ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తాను నిజామాబాద్ పర్యటనలో ఉన్న సమయంలో తనను కలిసిన ఉపాధ్యాయులు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ పదోన్నతులు కల్పించేలా చొరవ చూపాలని కోరారని తెలిపారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య విద్యాశాఖ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లి అర్హులైన ఎస్ఏలకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ నెల 24 నుంచి కొనసాగనున్న వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు కూడా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# విద్వేషాలు రెచ్చగొడుతున్న బిజెపి

## హైదరాబాద్‌కు ఏం చేశారో కిషన్‌రెడ్డి చర్చకు రావాలి: ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్

**హైదరాబాద్,ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల పేరుతో ప్రశాంతమైన హైదరాబాద్ నగరంలో బిజెపి నేతలు వివాదాస్పద వ్యాఖ్యలతో విద్వేషాలు పెంచుతున్నారని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ ఆరోపించారు.గాంధీభవన్‌లో సోమవారం విలేఖరులతో మాట్లాడుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హైదరాబాద్ అభివృద్ధికి ఏం చేయలేక, ప్రజలను భావోద్వేగాలతో రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటెల రాజేందర్ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు.హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి,ఎస్సీ ఓటర్లు బిజెపికి ఓటు వేయొద్దని ఆయన కోరారు.రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించి, బిల్లు కేంద్రానికి పంపితే బిజెపి నేతలు ఎందుకు మద్ధతు తెలపడంలేదని నిలదీశారు.ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర ధర్నా చేస్తే బిజెపి నేతలు ఎవరూ పాల్గొనలేదని ప్రశ్నించారు.హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక సాధారణ ఓటర్లు కాదు,వాళ్లంతా పార్టీ గుర్తుపై గెలిచిన ప్రజాప్రతినిధులు, ఎక్స్ అఫిషియో ఓటర్లు మాత్రమే ఓటు వేస్తారని వివరించారు.బలం లేకున్నా బిజెపి ఈ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేస్తోంది. ప్రజలందరికీ అర్థమైంది.ప్రతీ ఎన్నికల్లోపోటీ చేయాలనుకుంటే, మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి కొంత మంది బలం ఉన్నప్పటికీ ఎందుకు పోటీ చేయలేదు.ఈ ఎన్నికల్లో బిజెపి ఓటర్లు బిఆర్ఎస్‌పార్థికి ఓట్లు వేసినట్లు అందరికీ తెలుసు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి గెలవడానికి అవకాశమే లేదు, అయినా రాజకీయ లబ్ధి కోసం నగరంలో పోటీకి దిగుతోందన్నారు. 2020 జిహెచ్ఎంసి ఎన్నికల్లో బిజెపి ఎన్నో హామీలిస్తే, 2016లో 4 మంది వున్న కార్పొరేటర్లను 2020లో ప్రజలు 48 మంది కార్పొరేటర్లను గెలిపించారని చరిత్రను గుర్తుచేసుకున్నారు.రెండు సార్లు కేంద్ర మంత్రిగా వున్నా కిషన్ రెడ్డి ఈ హామీల అమలు కోసం ఎందుకు నిధులు తీసుకురాలేదు.గతంలో కేంద్ర మంత్రి గా పనిచేసిన జైపాల్ రెడ్డి హైదరాబాద్ అభివృద్ధి కోసం నిధులు తీసుకురాలేదా? అని గుర్తుచేసుకొన్నారు.

# కెనడాలో హిందు ఆలయంపై ఖలిస్థానీ ఉగ్రవాదుల దాడి

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** కెనడాలో ఖలిస్థానీ ఉగ్రవాదుల దుశ్చర్యలు ఆగడం లేదు. ఆ దేశంలోని హిందు దేవాలయాలను టార్గెట్ చేస్తున్న ఖలిస్థానీ ఉగ్రవాదులు సర్రేలోని శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయం వద్ద ఈ నెల 19వ తేదీన వీరంగం సృష్టించారు. దేవాలయం ప్రవేశ ద్వారం వద్ద ఇద్దరు దుండగులు నినాదాలు చేస్తూ, స్తంభాలు, ద్వారాలపై ఖలిస్థానీ అనుకూల నినాదాలు రాశారు. ఈ సందర్భంగా సిసిటివిలను ధ్వంసం చేశారు. ఈ ఘటనపై స్థానిక హిందు నేతల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేబట్టారు.

